జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 15-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 728 పేజీలు: 4 వెల : రూ.7



జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 15-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 728 పేజీలు: 4 వెల : రూ.7

# ఆర్‌జీయూకేటీలో.. అవుట్‌సోర్సింగ్.. రాజకీయం!




**☀ గేటు వద్ద 'మూమెంట్ రిజిస్టర్' పంచాయతీ ☀ ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు చేరిన వివాదం ☀ వేధిస్తున్నారంటూ సిబ్బంది ఆరోపణలు ☀ క్రమశిక్షణ కోసమేనంటున్న ఏజెన్సీ ☀ కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటున్న బాధితులు**

**ఎచ్చెర్ల/శ్రీకాకుళం, జులై 14 (వార్త):** ఎచ్చెర్లలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) క్యాంపస్ ఇప్పుడు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మధ్య వివాదాలకు, తీవ్ర ఉత్కంఠకు వేదికగా మారింది. టెండర్ దక్కించుకున్న నూతన మ్యాన్ పవర్ ఏజెన్సీ గేటు వద్ద ఏర్పాటు చేసిన 'మూమెంట్ రిజిస్టర్' నిబంధన చిలికి చిలికి గాలివానలా మారి, చివరకు ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ మెట్లెక్కింది. క్యాంపస్ లోపల గొడవలు వద్దంటూ పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పి ప్రస్తుతానికి సంధి కుదిర్చినప్పటికీ, అంతర్గతంగా మాత్రం ఉప్పు-నిప్పులాంటి వాతావరణం నెలకొంది. టెండర్ డాక్యుమెంట్ నిబంధనల ప్రకారం క్యాంపస్‌లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ప్రవర్తన, మంచి నడవడిక, పూర్తి క్రమశిక్షణను పర్యవేక్షించాల్సిన ప్రధాన పాత్ర, బాధ్యత సదరు మ్యాన్ పవర్ ఏజెన్సీదే. విధుల్లో ఉన్న ఉద్యోగులు పని వేళల్లో క్యాంపస్ దాటి ఎక్కడికి వెళ్తున్నారు, ఎప్పుడు వస్తున్నారనేది పర్యవేక్షించడానికి, క్యాంపస్ భద్రతను కాపాడటానికి ఏజెన్సీ మూమెంట్ రిజిస్టర్ నిర్వహించడంలో సాంకేతికంగా ఎలాంటి తప్పు లేదు. అయితే, ఈ రిజిస్టర్ విధానాన్ని సాకుగా చూపి ఏజెన్సీ ప్రతినిధులు తమను గంటల తరబడి గేటు వద్ద వేచి ఉంచుతున్నారని, మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేధింపులు భరించలేక ప్రస్తుతం పనిచేస్తున్న పాత సిబ్బంది స్వచ్ఛందంగా ఉద్యోగాలు వదిలి వెళ్లిపోతే, ఆ ఖాళీలలో కొత్త వారిని చేర్చుకుని లక్షలాది రూపాయలు వెనకేసుకోవచ్చనేది సదరు ఏజెన్సీ అసలు వ్యూహమని ఉద్యోగులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. టెండర్ నిబంధనల ప్రకారం 'ప్రస్తుతం పనిచేస్తున్న పాత సిబ్బందికే ప్రాధాన్యత ఇవ్వాలి' అని ఉన్నప్పటికీ, ఈ లూప్‌హోల్ ద్వారా కొత్తవారిని తెచ్చేందుకు ఏజెన్సీ ప్లాన్ చేస్తోందని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

## విద్యార్థులు, రెగ్యులర్ సిబ్బందికి తప్పని తిప్పలు..

మ్యాన్ పవర్ ఏజెన్సీ ప్రతినిధులకు, ఇటు సిబ్బందికి జరుగుతున్న ఈ అంతర్గత పోరు వల్ల క్యాంపస్‌లో విద్యా వాతావరణం దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ఈ క్యాంపస్‌లో మొత్తం 185 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వివిధ కీలక విభాగాల్లో పనిచేస్తున్నారు. ఇందులో ల్యాబ్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హాస్టల్, మెస్ కేర్‌టేకర్లు, విద్యుత్, ప్లంబింగ్ సిబ్బంది ఉన్నారు. గేటు వద్ద సంతకాల గొడవలు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగడం వల్ల ల్యాబ్స్ సక్రమంగా నడవక విద్యార్థులు




నష్టపోతున్నారు. హాస్టల్, మెస్ పర్యవేక్షణ లోపించి విద్యార్థుల భోజన వసతులకు ఆటంకం కలిగేలా ఉంది. అలాగే కార్యాలయాల్లో డేటా ఎంట్రీ, జూనియర్ అసిస్టెంట్ల సేవలు సకాలంలో అందక రెగ్యులర్ సిబ్బంది, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

## జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి..

టెండర్ నిబంధనల ప్రకారం సిబ్బంది హాజరుకు రోజువారీ బయో-మెట్రిక్ విధానాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. ఏజెన్సీకి పర్యవేక్షణ అధికారం ఉన్నప్పటికీ, దానిని వేధింపుల స్థాయికి తీసుకెళ్లడం మరియు నిబంధనలలో 0% సర్వీస్ చార్జ్ బిడ్‌లను తిరస్కరిస్తామని చెప్పినప్పటికీ సంస్థ ఇలాంటి వ్యూహాలకు తెరలేపడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్యాంపస్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా ఉండాలంటే జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, ఈ వివాదంపై పూర్తిస్థాయి విచారణ జరిపి జోక్యం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, రెగ్యులర్ సిబ్బంది కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

# ఫుడ్ పాయిజన్

- నలుగురు విద్యార్థినులకు తీవ్ర అస్వస్థత
- 40 మందికి వాంతులు, విరేచనాలు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు
- మధ్యాహ్న భోజనమే కారణం
- ప్రధానోపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు







సోంపేట, జులై 14(వార్త): సోంపేటలో గల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం చేసిన సుమారు 40 మంది విద్యార్థులకు వాంతులు, కడుపు నొప్పి రావడంతో కలకలం రేగింది. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులు తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు. బాధిత విద్యార్థులు 8వ తరగతి కె.రక్ష, 9వ తరగతి తలగాన.రక్ష, 6వ తరగతి ఎస్. ఐశ్వర్య, 9వ తరగతి ఎన్. వాహినిగా గుర్తించారు. బాధిత తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం అందుకున్న వెంటనే అధికారులు, మండల విద్యాశాఖ అధికారి కృష్ణమోహన్ పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. విద్యార్థులను ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందజేస్తున్నారు. వండిన అన్నం, సాంబారు తదితర పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. ఈ ఘటనా స్థలాన్ని స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి రమేష్ సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. బాధిత విద్యార్థులకు వెంటనే ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ప్రథమ చికిత్స అందించారు. ఘటనపై విచారణ జరిపిన అధికారులు నిర్లక్ష్యం వహించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల విద్యాశాఖ అధికారి కృష్ణమోహన్ తెలియజేశారు.

ఈ ఘటనతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతపై మరింత నిఘా ఉండాలని కోరుతున్నారు.


విద్యార్థులకు అస్వస్థతపై సమగ్ర విచారణ చేపట్టాలి

సోంపేట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనం తీసుకున్న అనంతరం సుమారు 50 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం అత్యంత బాధాకరమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రతపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్స అందించి, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ ఘటనకు గల కారణాలను వెంటనే వెలికితీసి, నిర్లక్ష్యం వహించిన అధికారులపై, సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం గార మండలం శాలిగుండం 45 మంది వసతి గృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకుండా విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చలగాటమాడుతుందని మండిపడ్డారు. తక్షణమే తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




# టార్గెట్.. సీదిరి..!





- ఆరవ్ కేసులో సంచలనంకు కేంద్ర బిందువు
- జగన్ మాటలకు కన్నీరు పెట్టుకున్న సీదిరి
- సెక్షన్ మార్పుల్లో రాజకీయ ఒత్తిళ్లే కారణమా?
- 18 ఏళ్ల యువకుడిపై మర్డర్ కేస్ పెట్టడం న్యాయమా?
- 105 సెక్షన్ జడ్జి కొట్టి వేసినప్పటికీ మరల చేర్చాలంటూ ఒత్తిళ్లు

పలాస, జులై 14 వార్త): మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అధికార పార్టీ నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. నిత్యం పలు అక్రమాలపై ప్రశ్నిస్తుండడంతో ఎదుర్కోలేక అవకాశం కోసం వారు ఎదురుచూస్తున్నారు. తన కుమారుడు బైకు ప్రమాదంలోనే ఎలాగైనా ఇరికించాలని కక్షతోనే ఈ ఘటనకు సీదిరి టార్గెట్ అయ్యారని విశ్వసనీయ సమాచారం. పలాసలో 2018 లో జరిగిన దోకి హరీష్ ఘటనతోనే లబ్ధి పొందారని భావించిన నాయకులు కుట్రలో భాగంగానే సీదిరి అప్పలరాజు టార్గెట్ అయ్యారని పలాస ప్రజలు చర్చించుకుంటున్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ కేసు ఎన్నో మలుపు తిరుగుతున్నాయి. ఈ కేసులో ప్రధానంగా 18 ఏళ్ల యువకుడిపై 105 కేసు సెక్షన్ పెట్టడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు బలంగా ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు ప్రమాదం ఘటనకు సంబంధించి మర్డర్ కేసు పెట్టడం ఏంటని సాక్షాత్తూ జడ్జి పోలీసులను ప్రశ్నించినట్టు సమాచారం. బైక్ యాక్సిడెంట్ లో ఒక నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి దుబ్బ దానయ్య మృతి చెందడంతో రాజకీయ కక్షతో ఇరికించేందుకు తెర వెనుక తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణ వెలువెత్తుతున్నాయి. ఈ విషయమై సాక్షాత్తు మాజీముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విశాఖలో మాట్లాడుతూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుమారుడిని మర్డర్ కేసులో ఇరికించాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. బైకు ప్రమాదంలో వాహనం ఢీకొని మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. పలాస కాశీబుగ్గ పట్టణవాసులు పలాస చరిత్రలో ఇలాంటి రాజకీయాలు తాము ఎన్నడూ చూడలేదని సీఎం చంద్రబాబు ప్రోద్బలంతోనే పలాస ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఇదంతా చేశారని పట్టణ వాసులు గుసగుసలాడుకుంటున్నారు. దీని వెనక కుట్ర కోణం దాగుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మాజీ మంత్రి అప్పలరాజును అరెస్టు చేసేందుకు తెరవెనుక గట్టిగా ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని తెలుస్తుంది. ఏది ఏమైనప్పటికి ఇలాంటి రాజకీయాలు పలాస చరిత్రలో ఎన్నడూ చూడలేదని, దీని పరంగా చూస్తే సీదిరి ని టార్గెట్ చేశారని పలువురు చర్చించుకుంటున్నారు.



## రోడ్డు ప్రమాదంపై 'పది లక్షల' రాజకీయం

- రైతు మృతిపై నోరు మెదపరా?
- దురదృష్టకర ఘటనపై మాజీ మంత్రి కుమారుడిపై హత్యానేరం మోపుతారా?
- కూటమి సర్కారు ద్వంద్వ వైఖరిపై మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ధ్వజం

రోడ్డు ప్రమాదంలో ఒక నిరుపేద ప్రాణం కోల్పోవడం అత్యంత విషాదకరమని, ఆ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని వైఎస్ఆర్సిపి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ స్పష్టం చేశారు. శ్రీకాకుళంలో మంగళవారం ఆయన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. చట్టం, న్యాయవ్యవస్థలపై తమకు సంపూర్ణ గౌరవం ఉందని, అందుకే సత్యం ఏంటో నిరూపితం కావాలనే ఉద్దేశంతోనే అప్పలరాజు కుమారుడు స్వచ్ఛందంగా పోలీసుల ముందుకు వెళ్లి విచారణకు హాజరయ్యారని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదంలో ఒక కుర్రాడిపై హత్యా నేరం మోపడం కూటమి ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపునకు పరాకాష్ట అని మండిపడ్డారు. దర్యాప్తునకు తమ వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెబుతూ.. జరిగిపోయిన ఒక దురదృష్టకర రోడ్డు ప్రమాదాన్ని రాజకీయంగా వాడుకోవడం తగదని హితవు పలికారు. రైతు మృతిపై పాలకుల ద్వంద్వ నీతి ఏంటి? రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే స్వయంగా వచ్చి వారి పార్టీ తరపున 10 లక్షల పరిహారం ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని.. అయితే ఇదే జిల్లాలో ఒక యూరియా బస్తా కోసం క్యూలైన్లలో నిలబడి ప్రభుత్వ వైఫల్యం వల్ల మరణించిన మహిళా రైతు కాంతమ్మ కుటుంబానికి ఆ స్థాయి పరిహారం ఎందుకు ప్రకటించలేదని కృష్ణదాస్ నిలదీశారు. వ్యవసాయ రంగంలో అవలంబిస్తున్న తప్పుడు విధానాల వల్లే కాంతమ్మ మరణించాల్సి వచ్చిందని, ఇది రైతులకు కూటమి ప్రభుత్వం పొడుస్తున్న వెన్నుపోటేనని దుయ్యబట్టారు. కాంతమ్మ చివరి నిమిషంలో నోట్లో నీరు పోస్తున్న కూతుళ్లను నెట్టివేసి, ఏడవడానికి కూడా వీల్లేదంటూ అధికారులు ప్రవర్తించిన తీరు అమానవీయమన్నారు. ప్రభుత్వం తప్పుడు నివేదికలతో కేసును తప్పుదోవ పట్టిస్తూ బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ విచారణ జరిపి.. ఆదుకోవాలి.. లేదంటే జిల్లా వ్యాప్త ఉద్యమం చేస్తాం.. తాము పూర్తి బాధ్యతాయుతంగా చట్టానికి సహకరిస్తుంటే.. మరోవైపు కాంతమ్మ మృతిపై పాలకులకు కనీస జవాబుదారీతనం లేకపోవడం దారుణమని విమర్శించారు. ఒకరికొక న్యాయం, మరొకరికి మరొక న్యాయం అన్నట్లుగా ప్రభుత్వ పెద్దలు వ్యవహరించడం వారి ద్వంద్వ విధానాలకు అద్దం పడుతోందన్నారు. ఇప్పటికైనా కాంతమ్మ మృతిపై తక్షణమే ఉన్నతాధికారులతో నిష్పక్షపాత న్యాయ విచారణ జరిపించాలని, బాధిత రైతు కుటుంబానికి కూడా ప్రభుత్వం భారీ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైకాపా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పలాసలో కదం తొక్కిన యాదవులు

## చెత్త నుంచి సంపద సృష్టిద్ధాం




**జి.సిగడాం, జూలై 14(వార్త):** చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీవో జి రామకృష్ణారావు సూచించారు. మంగళవారం పెంట గ్రామ చెత్త నుండి సంపద కేంద్రాన్ని అయెన పరిశీలించారు. చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలన్నారు.ఆదాయంతో పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టు వచ్చునన్నారు.గ్రామంలో ఉన్న తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా చేసి కేంద్రాన్ని తరలించి. వాటిని ఎరువులుగా తయారుచేసి రైతులకు అందించాలని కోరారు. ప్రజలు కూడా గ్రామ పంచాయితీ అదికారులకు, పారిశుధ్య కార్మికులకు సహారించాలని తెలిపారు.పోడి చెత్త వేరు చేయటంలో, ప్లాస్టిక్ వ్యర్థాలను కేంద్రంలోనే అస్తవ్యస్తంగా పడేయటంతో ఆయెన మండిపడ్డారు. అయెన గ్రామంలో పర్యటించే సమయంలో కేంద్రం నిర్వహణ, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, నిర్వహణలో అలసత్వం పై ఆయన అసహనం వ్యక్తం చేసారు. చెత్త సంపద కేంద్రం ఇక నుంచి ఇలా ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. తక్షణమే నిర్వహణ సక్రంగా ఉండాలని ఆదేశించారు. చెత్త సేకరణ రిక్షాలు తమ వీదులకు రావటం లేదని జంగాలవీది, విశ్వబాహ్మణుల వీదిలో చెత్త సేకరణ చేయటం లేదని తమ ధృష్టికి వచ్చిందని, ఆయా వీదులకు వెళ్లి చెత్త సేకరణ చేయాలని గ్రీన్ అంబాసిడర్లకు ఆదేశించారు. ఈయన వెంట పంచాయితీ కార్యదర్శి ఏ దుర్గారావు. నాయకులు మక్క నారాయణరావు, డోల పార్వతి, మీసాల రమణ, మీసాల విజయమ్మ తదితరులు ఉన్నారు

- దానయ్యకు న్యాయం చేయాలంటూ రోడ్డెక్కిన వేలాది మంది యాదవులు
- మాజీ మంత్రి అప్పలరాజుపై చర్యలకు డిమాండ్
- దిష్టిబొమ్మ దగ్ధం యత్నంతో ఉద్రిక్తత



**పలాస, జులై 14 (వార్త):** పలాస-కాశీబుగ్గలో హిట్ అండ్ రన్ కేసు రాజకీయ, సామాజికంగా మరింత వేడెక్కింది. గొర్రెల కాపరి దుబ్బ దానయ్య మృతి ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ యాదవ సంఘాలు మంగళవారం భారీ జైత్రయాత్ర నిర్వహించాయి. రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు లొడగల కామేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళన పలాస పట్టణంలో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించింది. శ్రీనివాస లాడ్జి జంక్షన్ నుంచి మూడు రోడ్ల కూడలి వరకు వందలాది మంది యాదవులు ప్లకార్డులు, బ్యానర్లు చేతబట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. "దానయ్య కుటుంబానికి న్యాయం చేయాలి", "నిజమైన నిందితులకు శిక్ష పడాలి", "సాక్ష్యాలు తారుమారు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి" అంటూ నినాదాలతో పలాస పట్టణం దద్దరిల్లింది. ర్యాలీ అనంతరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం, ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి, పోలీసు యంత్రాంగానికి తమ డిమాండ్లను వినిపించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ ఈ కేసులో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసులో సాక్ష్యాలను తారుమారు చేశారనే ఆరోపణలపై విచారణ జరిపి కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి నిజాలను దాచిపెట్టే ప్రయత్నాలు జరిగాయని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ధర్నా అనంతరం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు యాదవ సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అప్రమత్తమై అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఆందోళనకారులు, పోలీసుల మధ్య తోపులాట జరగడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘాల నాయకులు లొడగల కామేశ్వరరావు, సప్ప నవీన్, డి.తనరిసింగులు, వంకల కూర్మారావు మాట్లాడుతూ దానయ్య కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. కేసులో ఉన్న ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు



**జి.సిగడాం, జూలై 14(వార్త):** సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఎంఎ ీడీవో జి.రామకృష్ణారావు సూచించారు. మంగళవారం ఆయన పెంట గ్రామంలో కూటమి నాయకులు మక్క నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి అల్లాడ దుర్గారావు ఆధ్వర్యంలో గ్రామంలో వీధి వీధిలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. గ్రామంలో పర్యటించి ఈ పారిశుధ్య పనులను పరిశీలించారధీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లను, మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలన్నారు. మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. వారితో పాటు మీసాల రమణ, డోల పార్వతి ఉన్నారు.

# థర్మల్ అమరులకు వైసీపీ నివాళి



### ఎంజె పూలే సంఘం ఆధ్వర్యంలో..

మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీరావు ఆధ్వర్యంలోను పలాసపురం, లక్కవరం గ్రామాల వద్ద ఏర్పాటుచేసిన అమరవీరుల స్థూపాల వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. థర్మల్ విద్యుత్ వ్యతిరేక పోరాటంలో చోటు చేసుకున్న పరిణామాలను, ఉద్రిక్త పరిస్థితులను స్మరించుకున్నారు. ఇదిలా ఉండగా అప్పటి థర్మల్ ఉద్యమ కేసుకు సంబంధించి ఇదే రోజున బుధవారం సోంపేట కోర్టులో ఢిల్లీరావుతో పాటు 22 మంది హాజరై అనంతరం సంస్మరణ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

**సోంపేట, జులై 14 (వార్త):** థర్మల్ విద్యుత్ కర్మాగారం తమకు వద్దంటూ వ్యతిరేకించిన సోంపేటతో పాటు చుట్టుపక్కల ప్రజలపై పోలీసులు జరిపిన కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఇచ్చాపురం వైసిపి సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, తడక జోగారావు తదితరులు హాజరై అమరులను స్మరించుకున్నారు. సుమారు పదహారేళ్ల క్రితం జరిగిన కాల్పుల్లో గున్న జోగారావు, గొణప కృష్ణమూర్తి, బెండాలం కృష్ణమూర్తి అమరులయ్యారు . మత్స్యకారులు, రైతులు బ్రతుకులు సాగించే బీల ప్రాంతంలో పర్యావరణాన్ని హరించే కర్మాగారం వద్దంటూ జరిగిన పోరాటం విధితమే. వైశ్యరాజు నాగు, ఉత్తరాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా జగన్నాథుని నేత్రోత్సవం



**ఇచ్ఛాపురం, జులై 14 (వార్త):** జగన్నాధుని నవయవ్వన దర్శనం పరిపూర్ణ రూపంతో లభించడంతో భక్తులు పులకించారు. శ్రీక్షేత్రం పూరీతో సహా అన్ని జగన్నాధస్వామి దేవాలయాలలో నేత్రోత్సవాలను మంగళవారం శాస్త్రోక్తంగా జరిపారు. గల 15 రోజులుగా స్వామి దర్శనం కోసం భక్తులు పరితపించారు. కాగా గత మూడు రోజులుగా అద్భుత వర్ణాలతో అలరారిన జగన్నాధ, సుబద్ర, బలబద్ర, సుదర్శన, చిన్న జగన్నాధస్వామి విగ్రహమూర్తిరూపాలలో అర్చకులు ఎస్. పద్మకుమార్ ఆచార్యులు, వి.సాయికుమార్ ఆచార్యులు, ఎస్కేఎన్ మూర్తి, పాణింగపల్లి రామతేజాచార్యులు తదితరులు దైవత్వ శక్తులను మంత్రపూర్వకంగా పూర్ణకుంభం నుంచి తిరిగి స్వామివారిలోకి ఆవాహన చేసి, ప్రాణప్రతిష్ట జరిపారు. ఈ సందర్భంగా శాంతిహోమాదికాలు నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమాలను వైఖానసాగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. దిష్టికుంభదర్శనం, గోమాత దర్శనం అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. భక్తులు తొలుత అద్దంలో స్వామివారి ప్రతిబింబాన్ని చూసి, ఆపై నేరుగా స్వామిని వీక్షించారు. ఆలయ మేనేజర్ బెండి రామారావు పర్యవేక్షణలో జరిగిన ఈ నేత్రోత్సవ కార్యక్రమంలో సేవాదళ సభ్యులు కాళ్ల శ్రీనివాసరావు, మాటూరి చినసూర్యారావు, కంఠంశెట్టి రామకృష్ణ, ప్రకాష్ సాహు ,ఉలాల శేషుయాదవ్, కాదా రామకోటి, చిన్నారి మధు, కె.అనిల్, వజ్రపు మన్మథరావు, కదంబాల నవీన్, దేవరపల్లి గోపాల్, హరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఉత్సవంతో రథయాత్రకు స్వామివారు సిద్ధమైనట్లే. గురువారం సాయంత్రం రథంపై ఆవాహన చేసి, గుడించా మందిరం వరకూ యాత్ర సాగించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ మేనేజర్ బెండి రామారావు తెలిపారు.ం

# మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

**ంఇచ్ఛాపురం, జులై 14 (వార్త):** పొలం పిలుస్తోంది కార్యక్రమంలో తేలుకుంచి, బొడ్డకాలి, బుర్జపాడు గ్రామాల్లో ఎరువుల పంపిణీని అధికారులు పరిశీలించారు. మండలం పరిధిలోని తేలుకుంచి, బొడ్డకాలి, రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో రైతులకు యూరియా పంపిణీని ఎంపీడీఓ,ప్రభాకర్ రావు మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) అజయ్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఎరువుల నిల్వలు, పంపిణీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచిందని, రైతులు నమోదు, ఆధార్ అనుసంధానం పూర్తి చేసి, పంట విస్తీర్ణానికి అనుగుణంగా మాత్రమే ఎరువులు పొందాలని సూచించారు. పంట అవసరాన్ని బట్టి మాత్రమే నత్రజని భాస్వరం పొటాష్ ఎరువులను సమతుల్య మోతాదులో వినియోగించాలని, అధిక మోతాదులో ఎరువులు వేయరాదని తెలిపారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం వల్ల పంటకు ఆశించిన ప్రయోజనం లేకపోవడమే కాకుండా, నేల సారవంతత దెబ్బతిని రైతులకు అదనపు వ్యయం కలుగుతుందని వివరించారు. నేల పరీక్షల ఫలితాలు, పంట దశ, వ్యవసాయ శాఖ సిఫార్సుల ఆధారంగా మాత్రమే ఎరువులు వినియోగించాలని సూచించారు. నారు పెరుగుదల మందగించిన పొలాల్లో 2 శాతం యూరియా ద్రావణం పిచికారీ చేయాలని, జింక్ ఇనుము లోపం ఉన్నచోట 1 శాతం ఫెరస్ సల్ఫేట్ చీలేటెడ్ జింక్ పిచికారీ చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాలు, ప్యాక్స్‌ల సమన్వయంతో ఎరువుల పంపిణీ పారదర్శకంగా కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో మెరుగు సూర్యనారాయణ, శ్రీరాములు రెడ్డి, పిట్ట జంబారం, రామారావు, కూరయ్యస్వామి తదితర రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్యాక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకొని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు పిలుపునిచ్చారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# ప్రజల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వం బాధ్యత

**- ఆర్వోబీ నిర్వాసితులకు భూ పట్టాల పంపిణీ**

**- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, జులై 14 (వార్త):** ప్రజల హక్కులను పరిరక్షించడం కూటమి ప్రభుత్వం బాధ్యతని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస పార్టీ కార్యాలయంలో మంగళవారం పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబి) నిర్మాణం కారణంగా నిర్వాసితులైన కుటుంబాలకు భూ పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు భూ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా నెమలి నారాయణపురం సర్వే నంబర్--346, పురుషోత్తపురం సర్వే నంబర్--51లోని భూములకు సంబంధించిన మొత్తం 98 మంది నిర్వాసితులకు భూ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం చేపట్టే ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులైన కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరిస్తోందన్నారు. అర్హులైన ప్రతి నిర్వాసిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల హక్కులను పరిరక్షించడం తమ బాధ్యత అని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా నిరంతరం కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, ఆర్డీవో ఆర అప్పలరాజు ఎమ్మార్వో బి శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ పీరికట్ల విఠల్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లోడగల కామేష్ మున్సిపాలిటీ అధ్యక్ష, కార్యదర్శులు మున్సిపాలిటీ తెలుగుదేశంపార్టీ ముఖ్య నాయకులు, , నిర్వాసిత కుటుంబాల సభ్యులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమానికి కృషి చేయాలి

**- మార్కెట్ కమిటీలు రైతులకు అండగా నిలవాలి**

**- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**- జలుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశంలో పలు సూచనలు**

**జలుమూరు, జులై 14 (వార్త):** రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు మార్కెట్ కమిటీలు చొరవ చూపాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం జలుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు అనువైన గోదాం నిర్మాణం చేపట్టాలని సూచించారు. దీంతో రైతులు పంటను వెంటనే విక్రయించాల్సిన అవసరం లేకుండా, తగిన సమయంలో మంచి ధరకు అమ్ముకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి వ్యవసాయ మార్కెట్ కమిటీలు కీలక పాత్ర పోషించాలని, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే మార్కెట్ కమిటీ భవనం చుట్టూ రక్షణ ప్రహరీ నిర్మాణంతో పాటు గోదాం పైభాగంలో చైర్మన్ గది నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హామీ ఇచ్చారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జలుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, వైస్ చైర్మన్ డొక్క వెంకటరమణ, చల్లవానిపేట పీఏసీఎస్ చైర్మన్ దుంగ స్వామిబాబు, డైరెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం

**- నరసన్నపేట నియోజకవర్గంలో 2 లక్షల మందికిపైగా నమోదు పూర్తి -**

**ఈనెల 24 వరకు గడువు పొడిగింపు**

**- ఎన్నికల అధికారిణి బి. జయదేవి**

**నరసన్నపేట, జులై 14 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ఎన్నికల అధికారిణి బి. జయదేవి తెలిపారు. నియోజకవర్గంలో ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం 2,16,975 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 2,01,280 మంది తమ వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఇంకా 15,695 మంది ఓటర్ల వివరాలు నమోదు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. మిగిలిన ఓటర్ల వివరాల నమోదు పూర్తయ్యేలా భారత ఎన్నికల కమిషన్ ఈనెల 24వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆమె వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంకా ప్రక్రియ పూర్తి చేయని ఓటర్లు సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) లేదా ఎన్నికల అధికారులను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను సకాలంలో నమోదు చేయించుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని బి. జయదేవి విజ్ఞప్తి చేశారు.



# పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- బురద కొత్తూరులో మెగా పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**- పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణతోనే రైతులకు అధిక ఆదాయం సాధ్యమని పిలుపు**

**సారవకోట, జులై 14 (వార్త):** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పాడి పరిశ్రమ వెన్నెముక వంటిదని, ప్రతి పాడి రైతు పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తేనే అధిక పాల దిగుబడితో పాటు ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం సారవకోట మండలం బురద కొత్తూరు గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చడంతో పాటు గ్రామీణ స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో అనేక సంక్షేమ, రాయితీ పథకాలను అమలు చేస్తోందన్నారు. వర్షాకాలం, వాతావరణ మార్పుల కారణంగా పశువులకు సోకే వ్యాధులను నివారించేందుకు ప్రభుత్వం ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు అందజేస్తోందని తెలిపారు. పశువుల ఆరోగ్యం దెబ్బతింటే పాల ఉత్పత్తి తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అందుకే పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా మారుమూల గ్రామాల్లో కూడా ప్రత్యేక పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, నాణ్యమైన పశువైద్య సేవలతో పాటు ఆధునిక పశు పోషణ పద్ధతులు, సాంకేతిక సలహాలను పశువైద్య శాఖ ద్వారా నేరుగా గ్రామస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. శిబిరంలో పాడి పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు, టీకాలు ఉచితంగా అందజేశారు. పెద్ద సంఖ్యలో పాడి రైతులు తమ పశువులతో శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చిన్నాల కూర్మినాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, పీఏసీఎస్ చైర్మన్ సురవరపు తిరుపతిరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు పొద్దిన రత్నాలునాయుడు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాధు కృష్ణారావు, మాజీ జిల్లా కార్యదర్శి మూకళ్ళ చిన్నయ్య మాష్టారు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పట్ట ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రతినిధి శోభనపురం మురళీధర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డొక్క వెంకటరమణ, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధులు, పశువైద్య శాఖ అధికారులు, ఎంపీడీఓ, మండల విద్యాశాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాడి రైతులు పాల్గొన్నారు.



## శ్రీకాకుళం

### సీసీ రోడ్డును ప్రారంభించిన టీడీపీ నాయకులు



**కంచిలి, జులై 14 (వార్త):** అంపురం గ్రామంలోని 100 మీటర్ల సిమెంట్ రోడ్డును మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు తో పాటు పలువురు నాయకులు కలిసి మంగళవారం ప్రారంభించారు. నాలుగు లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఈ రహదారిని నిర్మించారు. రోడ్ నిర్మాణం పట్ల అంపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### పురుషోత్తపురంలో వీధి దీపాలు వెలిగించండి



**ఇచ్ఛాపురం, జులై 14 (వార్త):** పురుషోత్తపురం 1, 2 వార్డు లలో వీధి దీపాలు వెలగడం లేదని మాజీ కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గ్రీవిన్స్ సెల్ లో పిర్యాదు చేసారు. పెద్ద వీధి ,కాలనీ లో విద్యుత్ లైట్ లు వెలగక విష సర్పాలు తో ఇబ్బందులు పడుతున్నారని పిర్యాదు చేసారు.

### రోగికి ఆర్థిక సాయం



**ఇచ్ఛాపురం, జులై 14 (వార్త):** ఈదుపురం గ్రామానికి చెందిన బోర చిరంజీవి గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో పోరాడుతున్నారు. దురదృష్టవశాత్తూ, ప్రస్తుతం ఆయనకు ఒక కాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తేలుకుంచి యువభారత్ సేవా ఫౌండేషన్ హాస్పిటల్ మందులు కోసం ఐదు వేల రూపాయలు అందజేశారు.

### ముద్రగడ మృతి తీరని లోటు


**ఇచ్ఛాపురం, జులై 14 (వార్త):** కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతి కాపు సామాజిక వర్గానికి తీరని లోటు అని తెలగ సంఘం నాయకుడు కట్టా సూర్య ప్రకాశరావు ఒక ప్రకటన లో తెలిపారు. ఆయన మృతి కి సంతాపం తెలియజేసారు.

### విద్యార్థుల అభ్యసనా నైపుణ్యాలపై ఎంఈవో సమీక్ష

**- ప్రభుత్వ పాఠశాలల సందర్శన**

**- హోంవర్క్, బోధనా తీరు పరిశీలన**

**జలుమూరు, జులై 14 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన నైపుణ్యాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) బమ్మిడి మాధవరావు సూచించారు. మంగళవారం జలుమూరు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా బొడ్డపాడు ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈవో విద్యార్థుల హోంవర్క్ పుస్తకాలను పరిశీలించి బోధన తీరుపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థుల్లో ఉన్న అభ్యసన సామర్థ్యాలను గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీసే విధంగా ప్రణాళికాబద్ధంగా బోధన సాగించాలని, బలహీన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారికి అవసరమైన తోడ్పాటు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో పఠనం, రాత, గణిత నైపుణ్యాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని ఎంఈవో పేర్కొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

-ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి

- సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్

- ఆదివాసీ హక్కుల పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరిక



**పాలకొండ, జులై 14 (వార్త):** ఆదివాసీల భూములు, అడవులు, సహజ వనరుల పరిరక్షణకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి డిమాండ్ చేశారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసులో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసి చట్టాన్ని సమర్థించాలని ఆదివాసీ జేఏసీ మన్యం జిల్లా అధ్యక్షుడు బిడ్డిక శ్రీను కోరారు. మంగళవారం పాలకొండలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వాబ్. యోగి మాట్లాడుతూ, 1968లో జరిగిన శ్రీకాకుళం గిరిజన సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగానే 1/70 చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఆదివాసీల భూములను రక్షించేందుకు దీర్ఘకాల పోరాటాలు జరిగాయని, ఆ ఉద్యమంలో అనేక మంది ఆదివాసీలు, ఉద్యమ నాయకులు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. 1970 ఫిబ్రవరి 3న రాష్ట్రపతి ఆమోదంతో అమల్లోకి వచ్చిన 1/70 చట్టం ఆదివాసీల భూహక్కులను కాపాడేందుకు రూపొందించబడిందని చెప్పారు. ఈ చట్టం రద్దు అయితే ఆదివాసీల భూములు, అడవులు, జలవనరులు పెద్ద కంపెనీలు, రియల్ ఎస్టేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్, ఆర్టికల్ 244 ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాల్లో గిరిజనేతరులు భూములు కొనుగోలు చేయరాదని, 1997లో సుప్రీంకోర్టు ఇచ్చిన సమతా తీర్పు కూడా ఆదివాసీల భూహక్కులను సమర్థించిందని ఆయన పేర్కొన్నారు. జేఏసీ మన్యం జిల్లా అధ్యక్షుడు బిడ్డిక శ్రీను మాట్లాడుతూ, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కౌంటర్ దాఖలు చేసి ఇంప్లీడ్ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరిగితే ఆదివాసీలు మరోసారి ఉద్యమానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ జేఏసీ కార్యదర్శి బిడ్డిక ఉమామహేశ్వరరావు, తిరుమలరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కమిటీ సభ్యుడు సవర సింహాచలం, మిన్నరావు, సవర వెంకటరమణ, సవర పేతురు, కొండదొర వినోద్, యోగేష్, శ్రీకాంత్, భాస్కర్, కాంతారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## నరసన్నపేట మేజర్ పంచాయతీకి రెగ్యులర్ ఈవో ఏరీ?

- ఖాళీగా ఉన్న పోస్టుతో పరిపాలనపై ప్రభావం
- అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు పెరుగుతున్నాయని స్థానికుల ఆందోళన




**నరసన్నపేట, జులై 14 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీకి గత ఏడాదిగా రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) లేకపోవడంతో స్థానికుల సమస్యలు పరిష్కారానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పరిపాలనలో కీలకమైన ఈవో పోస్టు ఇప్పటికీ భర్తీ కాకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ ఈవో లేకపోవడంతో పలు అభివృద్ధి పనులు, పరిపాలనా నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందడం లేదని, సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని వాపోతున్నారు. పంచాయతీలో పర్యవేక్షణ లోపించడంతో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ స్థలాలు కూడా ఆక్రమణలకు గురవుతున్నాయని పేర్కొంటున్నారు. మేజర్ పంచాయతీ పరిపాలనను గాడిలో పెట్టేందుకు వెంటనే రెగ్యులర్ ఈవోను నియమించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఖాళీ పోస్టును భర్తీ చేసి పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మూలుగుతున్న పనస పండు!

- గిరాకీ లేని పరిస్థితి
- ఆదాయం కోల్పోయిన ఉద్దానం రైతన్న

**సోంపేట, జులై 14(వార్త):** ఉద్దానం ప్రాంతం అంటే ఉద్యాన పంటలకు నిలయం. కొబ్బరి, జీడి, మామిడి, పనస మొదలైన పంటలు ఆ ప్రాంత రైతన్నలకు ఎంతగానో ఆర్థిక భరోసా ఇస్తాయి. వాటిపై ఆధారపడి వేలాది వ్యవసాయ కుటుంబాలు జీవిస్తూ ఉంటాయి. అటువంటిది ఈ ఏడాది పనసపండు పరిస్థితి ఘోరంగా మారింది. పంట దిగుబడి బాగా వచ్చినప్పటికీ కొనుగోళ్లు లేక డిమాండ్ రాక ఇప్పటికీ పనస పళ్ళు చెట్లలోనే కుళ్ళి రాలిపోతున్నాయి. పండు ద్వారా పది రూపాయల ఆదాయం వస్తుందని ఎంతగానో ఎదురు చూసిన రైతన్నలకు అడియాసలే మిగిలాయి. వివరాల్లోకి వెళితే ఇచ్ఛాపురం నుంచి కవిటి, కంచిలి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు తదితర మండలాల్లో గల తీరప్రాంతాన్ని ఉద్దానంగా పిలుస్తారు. దీనికి పర్యాయపదమే ఉద్యానవనం. పచ్చని చెట్లతో ఫల సాయం ఇచ్చే వృక్షాలతో ఎంతో అందంగా అలరించే ఈ ఉద్దానం ప్రాంతంలో నివసించే వేలాది కుటుంబాలు వారు, వారు పండించే పంటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తరతరాలుగా ఈ విధమైన పంటలు ఆ ప్రజలకు జీవనాధారం.

### పిందే ఫర్వాలేదు... పండు మాత్రం నిరాశే

ఈ ఏడాది పనస పిందె దశలో అనగా సుమారు కిలో బరువు నుంచి రెండు మూడు కిలోల వరకు ఉన్న పనస పిందెలు మాత్రం ఈ ఏడాది రైతుకు పర్వాలేదనిపించాయి. లేత దశలో పనసకాయలు సేకరించి ఇతర రాష్ట్రాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పనస పిందెలకు మంచి గిరాకీ ఉండడంతో ఇక్కడ ఓ మోస్తరు ధర పలకడంతో రైతులు కాస్తో కూస్తో ఆదాయం సంపాదించుకున్నారు. అలాగే పనసకాయలను పండేంతవరకు ఉంచితే జూన్, జూలై నెలలో అధిక ధరలు వస్తాయని రైతులు ఆశించినప్పటికీ అనుకున్న రీతిలో లాభాలు లేకపోవడంతో స్వల్పధరలకు అమ్ముకోవాల్సి వచ్చింది. అవి కూడా పూర్తిగా చెల్లే పరిస్థితి లేక రైతులు ఇప్పటికీ చెట్లలోనే వదలాల్సి వచ్చింది. ఎక్కడ చూసినా పనస పండ్లు కుళ్ళిపోయి చెట్ల వద్దనే రాలిపోతున్నాయి.

### దిగులు చెందుతున్న రైతులు

జీవనాధారమైన పంటల ద్వారా సీజన్లో కొంతమేరకు ఆదాయం పొందవచ్చు అన్న ఆశతో మంచి మంచి వెరైటీ పనస మొక్కలు నాటి కంటికి రెప్పల వాటిని పెంచి పెద్ద చేస్తున్నారు రైతులు. అటువంటి పరిస్థితుల్లో దిగుబడులు బాగా వచ్చినప్పటికీ ఈ ఏడాది కొనుగోళ్లు నామమాత్రంగా ఉండడంతో రైతులు పండించిన పంట గిట్టుబాటు లేక స్వల్ప ఆదాయంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. దీంతో ఉద్దానం రైతులు పనస పంట విషయంలో దిగులు చెందుతున్నారు. ఖర్జూరం, కర్పూరం వంటి వెరైటీలు ఇంకా కళ్ళ ఎదుట వృధాగా రాలుతూనే ఉన్నాయి. రైతులు స్వయంగా సమీప ఒడిశా గ్రామాలకు కూడా పనస పండ్లు విక్రయించేందుకు తీసుకు వెళుతున్నప్పటికీ డిమాండ్ లేక పది రూపాయలకు కూడా కొనే నాథుడు లేక వృధా చేయాల్సి వస్తుందని ఉద్దానం రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.



## వంశధార క్వార్టర్స్‌లో నిరుపయోగంగా 108 వాహనాలు

- నిర్లక్ష్యంతో తుప్పుపట్టి శిథిలావస్థకు చేరిన వైనం
- పాడైన వాహనాలను తొలగించాలని స్థానికుల విజ్ఞప్తి




**నరసన్నపేట, జులై 14 (వార్త):** నరసన్నపేటలోని వంశధార క్వార్టర్స్ ప్రాంగణంలో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించే 108 అంబులెన్స్ వాహనాలు నిరుపయోగంగా పడి ఉండటం స్థానికులను కలవరపెడుతోంది. చాలా కాలంగా వినియోగంలో లేకపోవడంతో వాహనాలు తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడాల్సిన అత్యవసర సేవల వాహనాలను ఈ విధంగా నిర్లక్ష్యంగా వదిలేయడం ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై అధికారుల వైఖరిని ప్రశ్నించేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సరైన నిర్వహణ లేకపోవడంతో వాహనాలు పూర్తిగా పాడైపోయాయని, కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోందని విమర్శిస్తున్నారు. వంశధార క్వార్టర్స్ ప్రాంగణంలో పాడైన వాహనాలు ఉండడం వల్ల పరిసర ప్రాంతాల పరిశుభ్రతకు కూడా భంగం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. వీటిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావడం సాధ్యంకాకపోతే, నిబంధనల ప్రకారం వెంటనే తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న 108 వాహనాలపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## శిథిలావస్థకు చేరిన వంశధార క్వార్టర్స్

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయంటున్న స్థానికులు
- శిథిల భవనాల తొలగింపు, ప్రభుత్వ అవసరాలకు కొత్త నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి

**నరసన్నపేట, జులై 14(వార్త):** నరసన్నపేటలోని వంశధార క్వార్టర్స్ శిథిలావస్థకు చేరి పూర్తిగా నిరుపయోగంగా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వినియోగంలో లేకపోవడంతో భవనాలు శిథిలమై ప్రమాదకరంగా మారాయని పేర్కొంటున్నారు. స్థానికుల కథనం ప్రకారం, నిరుపయోగంగా ఉన్న ఈ క్వార్టర్స్‌లో ఆకతాయిలు చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నట్లు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో సంచరించేందుకు ప్రజలు వెనుకంజ వేస్తున్నారని అంటున్నారు. ప్రమాదకరంగా మారిన శిథిల భవనాలను వెంటనే కూల్చివేసి, ఆ స్థలంలో ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా నూతన కార్యాలయాలు లేదా ప్రజలకు ఉపయోగపడే భవనాలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. విలువైన ప్రభుత్వ భూమి నిర్లక్ష్యానికి గురికాకుండా, ఆక్రమణలకు ఆస్కారం లేకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. శిథిల భవనాల వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తూ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ స్థలాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## మాకివలస ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

**నరసన్నపేట, జులై 14 (వార్త):** నరసన్నపేట మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) ఉప్పాడ శాంతారావు మంగళవారం మాకివలస ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఎంఈవో వారి అభ్యసన సామర్థ్యాలను అంచనా వేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి నేర్చుకునే స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఆయన, విద్యార్థులకు రుచి, శుచి, పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. వంటశాల పరిశుభ్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (హెచ్‌ఎం), ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేయాలని ఎంఈవో సూచించారు.




## పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి
- బురద కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గది, ప్రహరీ ప్రారంభం


**సారవకోట, జులై 14 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు.

మంగళవారం సారవకోట మండలంలోని బురద కొత్తూరు మండల ప్రాథమిక పాఠశాలలో సుమారు రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గది, ప్రహరీ గోడను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రహరీ నిర్మాణం ద్వారా విద్యార్థుల భద్రత మెరుగుపడటంతో పాటు పాఠశాల ఆవరణ పరిరక్షణ కూడా బలోపేతం అవుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక సదుపాయాలు అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణం పూర్తికావడంతో విద్యార్థులకు విశాలమైన తరగతి గదులు అందుబాటులోకి వస్తాయని, ప్రహరీ గోడ నిర్మాణంతో భద్రత మరింత మెరుగుపడుతుందని గ్రామస్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు చేపట్టిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చిన్నాల కూర్మినాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, పీఏసీఎస్ చైర్మన్ సురవరపు తిరుపతిరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు పొద్దిన రత్నాలునాయుడు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాధు కృష్ణారావు, మాజీ జిల్లా కార్యదర్శి మూకళ్ళ చిన్నయ్య మాష్టారు, క్లస్టర్ ఇన్‌చార్జి పట్ట ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రతినిధి శోభనపురం మురళీధర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డొక్క వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546